# రేషను కార్డు

**- యెన్నం ఉపేందర్**



ఊరంతా సందడిగా ఉంది. ఎమ్మెల్యే, ఆయన వెంట పోలీసులు, రెవెన్యూ సిబ్బంది, అనుచర వర్గం వస్తున్నారని ఎవరో వార్త మోసుకొచ్చారు.

'దెశమంతుడు. కలకటేరు పరీచ్చ పాసయిండు. యింగ మనూరు బాగుపడ్తది' అని జనం నా గురించి అనుకోసాగారు. ఇవేమీ పట్టించుకోకుండా, మౌనంగా ఊరి చెరువుకట్ట వైపు సాగిపోయాను. నేనెప్పుడూ కూర్చొనే ప్రదేశంలో కూర్చొని, చెరువులోకి గులకరాళ్లను విసరసాగాను. విసిరిన ప్రతిసారీ వలయాలు పుడుతున్నాయి. నెమ్మది నెమ్మదిగా ఒడ్డువేపు రాసాగాయి, వృత్తాలుగా. ఏదో ఆనందం... ఏవో జ్ఞాపకాలు మనసులో రూపుదిద్దుకోసాగాయి.

'కంట్రోలు బియ్యమొచ్చినయట. పొద్దుగాల లేసి, ఆకిలూకి, అలుకుజల్లి లైన్ల నిలబడాల' అని సూరమ్మ అమ్మతో అంటోంది. 'గట్లన' అన్న అమ్మ ముఖంలో నిట్టూర్పు కనిపించింది.

'తింటానికి తిండి లేదు గానీ పట్నంల సదవబోయిండు. నెల కాకముందే సదువు ఇడిసి పెట్టిండు' అని జనం నా గురించి ఎకసక్కాలాడటం వారి రోజువారీ కాలక్షేపం కబురు.

'ఈ రోజుల్లో సదువు బువ్వ బెట్టుద్దా. ఏదో పనిజేస్కొని బతుకక' అని బంధువులు చెవులు కొరుక్కోవటం నాకు కొత్త కాదు.

'అయిన వాళ్లెవరూ ఆదుకోరు. మన కట్టాలు మనం పడాల' అని అమ్మ అంటుంటుంది.

'గట్క సిక్కంగా కలిపి ఉట్టి మీదుంచిన ఆకలయ్యేంత వరకు ఎదురు సూడకు' అన్న అమ్మ మాటలతో ఆలోచనలకు బ్రేకు పడింది. అప్పటికి చాలా నెలలైంది వరి అన్నము తిని.

'యియ్యాల మా అవ్వ మెతుకులొండింది. కమ్మగ దినాల' అని నాతోటి చదువుకున్న చంద్రయ్య, మాట్లాడే విషయమేదైనా ఈ మాటలు నాతో అనడం, నేను 'అట్లన' అనడం వారానికి ఒక్కసారి జరిగే తంతే.

'పిలగాడు గుండె బలుగుతడు. అందుకే సొద దీస్కుంట కూలికొచ్చినప్పుడు' అని సూరమ్మతో అమ్మ అప్పుడప్పుడు అంటుండుత. సూరమ్మే చెప్పింది. ఆ మాట ఈ మాట చెప్పి, 'నువు పెద్ద సదువులు సదువాల బిడ్డా. గవుర్మెంటు ఉజ్జోగం జెయ్యాల. మీ అమ్మ కాయిశది'– అన్న సూరమ్మ మాటలు చెవుల్లో ఎప్పుడూ వినబడుతుండేవి.

కళ్ల ముందు కనబడుతున్న 'ఉట్టి' ఆకలిని జ్ఞాపకం చేసింది. ఎప్పుడో 'ఇంత' భూమి ఉందని రెవెన్యూ వాళ్లు రేషను కార్డు ఇవ్వలేదు. ఈ రోజు ఎలాగైనా 'ఇన్ని' బియ్యం సంపాదించాలని, ఒకవైపు ఆకలనిపిస్తున్నా, చౌక ధరల దుకాణం నడుపుతున్న డీలరు దగ్గరకు వెళ్లాను. అతను ఒకప్పటి నా స్కూలు మేటు. పలుకుబడితో డీలరుగిరి సంపాదించాడని జనం అనుకుంటారు. కొద్దిగా బియ్యం ఇప్పించమని, అభిమానం అడ్డొస్తున్నా అడగక తప్పలేదు. పదో తరగతి మెరిట్ స్కాలర్ షిప్పు ఈ విధంగా అక్కరకు రావటం ఒక విధంగా సంతోషమే. 'నీ దగ్గరెక్కడియిరా డబ్బులు' అని చాటలో మెరుస్తున్న ఎర్ర మసూరి బియ్యాన్ని కండ్ల పండుగగా చూస్తూ అమ్మ అడిగింది. అమ్మకు ఏమీ జవాబియ్యకుండానే మండల కేంద్రానికి బయలుదేరాను. జేబులో ఇంకా యాభై రూపాయలు ఉన్నాయి. ఎలాగైనా రేషను కార్డు సంపాదించాలని మనసులో నిశ్చయించుకున్నాను. ఎమ్మార్వో అడ్రసు తెలుసుకొని ఇంటికి వెళ్లాను. అంట్లు తోముతున్న పనిమనిషి నన్ను చూడగానే–

'అయ్యగారు ఇప్పుడే లంచ్ జేసిండు. క్యాంపుకు బొయి యిప్పుడే ఒచ్చిండు' అని అంది. 'అయ్యగార్ని కలవాలని' పట్టుబట్టడంతో లోపలికి పోయి వచ్చి 'పొమ్మని' సైగ జేసింది. ఎమ్మార్వో వాలు కుర్చీలో విశ్రాంతి తీసుకుంటూ 'ఏందన్నట్లు' చూశాడు. నేను సమయాన్ని వృథా చేయదలచుకోలేదు.

'సార్ మేం చాలా పేదోల్లం. రేషను కార్డు లేదు. కార్డు యిప్పియ్యాల మీరు' అన్నాను ప్రాధేయపడ్తూ. అదోలా నావైపు చూసి 'రేపు రా' అన్నాడు. అలాగ వారం గడిచింది. మరలా ఆదివారమొచ్చింది. ఈసారి ఎమ్మార్వో కాస్త మెత్తబడ్డట్లు కనిపించాడు. జేబులో డబ్బు గుర్తుపట్టాడేమో!

అదీ యిదీ మాట్లాడి 'కార్డు గావాల్నంటే మాటలా కర్సయిద్ది' అని సెలవిచ్చాడు. నాకు తెలీకుండానే జేబులోకి చేయి వెళ్లింది.

'గిది నాకు సరిపోద్ది. ఆఫీసుల కనపడు' అని లోపలికెళ్లాడు. యాభై రూపాయలు పోతే పొయ్యాయిగని మాకు కార్డు దొరుకుద్ది' అని మనసు ఉప్పొంగింది.

తెల్లవారి ఆఫీసుకెల్తే నేను తెలవనట్లే ఎమ్మార్వో ప్రవర్తించాడు. అన్యాపదేశంగా–

'మీ ఊళ్లున్న విఎఓను కలువు. అంచెలంచెలుగ నీ దరఖాస్తు రావాల. ఆర్ఐ, సూపరింటెండెంటు, అటెం... అని ఇంకా ఏదో చెబుతున్నాడు.

జీవితంలో తప్పు చేశానన్న గిల్టీ ఫీలింగు... ఒక నిర్ణయం... కళ్లముందు స్క్రీను సేవర్లుగా దృశ్యాలు.

'పంతులు కట్నం లేంది పాఠం అబ్బుద్దారా సుంతా ఇంట్ల గాసిన కూరగాయలు దీస్కురా' అన్న అయ్యవారు, గెజిటెడ్ సిగ్నేచర్ గావల్నంటవు. ఉత్తగ పచ్చింకు సంతకం బెట్టమంటవు. ఈ కాలపు మనిషి లెక్క లేదు నువు. నువు నాకు దెల్వదు పో' అన్న సివిల్ ఆసుపత్రి డాక్టరు, 'కరంటోల్లు ఒచ్చిండ్రు యియ్యాల, నిన్ననే పోలీసోల్లొచ్చిండ్రు. ఊళ్లో నాటు కోళ్లు దొర్కటం లేదు. దొర తంతడేమో'నని గాబరాపడే దొర జీతగాడు, 'ఉద్యోగం ఎంత ప్రయత్నించినా దొరకటం లేదని' ఉరేసుకున్న గొల్లోల్ల సాయిలు, ఇంకా మసక మసకగా ఏవో దృశ్యాలు...

ఇంటర్మీడియట్ మధ్యలో వదిలి, మరల ఏదోలా పూర్తిచేసి, ఆ తర్వాత రకరకాల ఇబ్బందులు పడి డిగ్రీ పూర్తి చేయటం... ఆ తర్వాత...

దూరం నుంచి జనం వెతుకుతూ వస్తున్న శబ్దం వినబడింది. అలల వలయాలు చెరువు ఒడ్డుదాకా వచ్చి మరల కలుద్దామన్నట్లు మాయమయ్యాయి. రీలులా తిరుగుతున్న నా పాత జ్ఞాపకాల వలె! మందహాసం నా వంతు అయ్యింది. ❁